## క్లుప్తంగా

### ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మోతి



బుచ్చినాయుడుకండ్రిగ: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ వెంకటరత్నమ్మ నెల రోజుల శిక్షణ కోసం వెళ్లడంతో ఏఓగా పని చేస్తున్న మోతికి బాధ్యతలు అప్పగించారు.

### వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



కొండయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు: మండలంలోని కాసరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొండయ్య సోమవారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గ్రామానికి చేరుకున్నారు. కొండయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, ఢిల్లీ బాబు, గంగాధరం, శ్రీరాములురెడ్డి, ప్రభాకర్, వీరరాఘవులు, రఘునాథ్‌రెడ్డి, పాపయ్య, శంకరయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

### ఉత్తమ ఎంఈఓకు సత్కారం



ఎంఈఓను సత్కరిస్తున్న ఎస్టీయూ నేతలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉత్తమ మండల విద్యాశాఖాధికారిగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా సత్కారం అందుకున్న రవీంద్రనాథ్‌ను సోమవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం, ఎస్టీయూ నాయకులు రామచంద్రయ్య, సురేష్, వెంకటేష్, కులశేఖర్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

### యాప్‌లో సభ్యుల వివరాలు



కూరగాయల విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సత్యవేడు: స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డుల వివరాలను ఎంబీకే 2.0 యాప్‌లో నమోదు చేయాలని వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ కోరారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమవారం ఎంబీకే యాప్ నిర్వహణపై నిర్వహించిన సంఘమిత్రల సమావేశానికి ఎంపీడీఓ త్రివిక్రమరావు, స్టేట్ బ్యాంకు మేనేజర్ సూర్యప్రకాష్ హాజరయ్యారు. ఏపీఎం మాట్లాడుతూ సంఘ నిర్వహణకు సంబంధించిన పుస్తకాల వివరాలన్నీ ఎంబీకే యాప్‌లో అప్‌లోడ్ చేసి ఉండాలన్నారు. సీడ్ క్యాపిటల్లో భాగంగా చిరు వ్యాపారులకు స్త్రీనిధి ద్వారా రూ.40వేల రుణాన్ని మంజూరు చేస్తామన్నారు. ఇంటి పెరటిలో కూరగాయలు, ఆకు కూరలుగా పండించుకోవాలన్నారు. ఎంపీడీఓ త్రివిక్రమరావుతో కలసి కూరగాయల విత్తనాలను సంఘాల మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు మధుసూదన్, శివకుమార్, పుల్లయ్య, పురుషోత్తం, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కోటేశ్వరి, అకౌంటెంట్ కాంచన తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సంఖ్యను పెంచాలి



విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం సూచించారు. ఆయన సోమవారం గాజులపెళ్లూరు గ్రామం ఎస్టీ కాలనీలో పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, రికార్డులు, రిజిస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి టీచర్లకు, భోజన నిర్వాహకులు సూచనలు చేశారు. ఒకటో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించి, విద్యార్థుల్లో అక్షరాలను గుర్తించడంతోపాటు, రాయడం వంటి నైపుణ్యాలను మెరుగు పరచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూధితోఅభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.









స్వర్ణముఖి నది వద్ద ఉన్న చెత్త

# స్వర్ణ చెత్త మయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నది చెత్తాచెదారంతో నిండిపోయింది. జల వినాయకుని నుంచి స్వర్ణముఖి నదిలో దిగే ప్రాంతం మొత్తం దుర్గంధ భరితంగా మారింది. దీంతో భక్తులు అటు వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. అగస్త్య మహర్షి తపస్సు చేయడం వల్ల ఈ నది దివి నుంచి భూమికి దిగివచ్చిందని పెద్దలు చెబుతారు. ఇది చంద్రగిరి మండలంలోని తొండవాడలో పుడుతుంది. తొండవాడ అగస్తీశ్వరాలయం, యోగిమల్లవరం పరాశరేశ్వరాలయం, గుడిమల్లం పరశురామేశ్వరాలయం, గాజులమండ్యం మూలస్థానేశ్వరాలయం గుండా శ్రీకాళహస్తికి ఉత్తరవాహినిగా వంద కిలోమీటర్లు ప్రవహించి నాయుడుపేట సమీపంలో సముద్రంలో కలుస్తోంది. ఇటువంటి పుణ్యనది నేడు దుస్థితిలో ఉంది. ఇందులో ఇసుక బంగారు వర్ణంలో ఉండటం వల్ల



స్వర్ణముఖి నదిలో ఉన్న చెత్త

దీనికి స్వర్ణముఖి అని పేరు వచ్చింది. అంతేగాక నదీ తీరంలో మొగలి పొదలు ఉండడంతో మొగలేరు అని పేర్లు ఉన్నాయి. అలాగే ఆలయ నిర్మాణంలో పనిచేసిన కూలీలు ఈ నదిలో తమ కష్టానికి తగ్గట్లు ఫలితం దక్కిందని చెబుతారు. అలాంటి గొప్ప నది కూటమి ప్రభుత్వంలో దుస్థితిలో చేరు



రామసేతు వంతెన వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

కుంది. కూటమి నేతలు డబ్బు సంపాదనే ధ్యేయంగా స్వర్ణముఖి నదిలోని ఇసుకను ఇతర జిల్లాలకు తరలిస్తూ మురుగు, చెత్తాచెదారంపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి నదిని బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## అన్నదాత పోరుకు తరలిరండి



మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: అన్నదాత పోరుకు రైతులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతులతో కలిసి నిరసన ర్యాలీ చేపడతామన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరారు. అలాగే రైతులకు తగినంత యూరియా అందజేయాలని డిమాండ్ చేశారు.

**అన్నదాత పోరును విజయవంతం చేద్దాం**

ఏర్పేడు: శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిశోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్ పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నిరసన తెలపనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

**కూటమికి బుద్ధి చెబుదాం**

రేణిగుంట: శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కదలి వచ్చి కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్ పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై జరగనున్న కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం పోలి పంచాయతీలోని భీమవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సాంబశివయ్య, మునెమ్మ కుమారుడు తేజ వివాహం ఈ నెల 4న జరిగింది. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి లేకపోవడంతో సోమవారం భీమవరం వెళ్లి వధూవరులు తేజ, మౌనికను ఆశీర్వదించారు. అనంతరం అదే గ్రామానికి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గురవయ్యానాయుడును కలిశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి వయ్యాల మనోహర్‌రెడ్డి, నాయకులు రంగినేని చెంచయ్యనాయుడు, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డి, సర్పంచులు సురేంద్రయాదవ్, నరేష్‌రెడ్డి, నాయకులు గుణ, పెంచలయ్య, వెంకటరత్నం, చలపతి, సాంబయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

## ఆధార్ క్యాంపునకు విశేష స్పందన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రూరల్ మండలం మేలచ్చూరు గ్రామ సచివాలయంలో సోమవారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారుజ. ఆధార్ కార్డులేని పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులను గుర్తించి బర్త్ సర్టిఫికెట్ ద్వారా ఆధార్ నమోదు చేశారు. శ్రీకాళహస్తి మండలంలో ఈ వారంలో ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాన్ని నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, పవిత్ర, బ్రాహ్మణపల్లి మహిళా పోలీసు హేమావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి, గిరీష్, ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, రామచంద్రయ్య, గిరిజన సంక్షేమ శాఖ కోఆర్డినేటర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ క్యాంపునకు హాజరైన చిన్నారులు

## ఎరువుల కొరతపై సీపీఐ నిరసన


రేణిగుంట: రాష్ట్రంలో రైతులకు యూరియాతో పాటు ఇతర ఎరువులు కొరతను తీర్చాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం రేణిగుంట పట్టణంలోని వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి వైఎస్ మణి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు విత్తనాలు, పురుగు మందుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. యూరియా కొరతతో రైతులు బారులు తీరుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మురళి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వి.కార్తీక్, సెల్వ, అమ్ములు, రమణ, శివగామి, మణి, విక్రమ్, లక్ష్మి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**రైతులకు తక్షణమే యూరియా అందించాలి**

వరదయ్యపాళెం: రాష్ట్రంలో రైతులకు తక్షణమే యూరియా అందించాలని సీపీఐ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం వరదయ్యపాళెం వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో కలసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అణువణువునా రైతులను ఇబ్బందిపెట్టేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటను సాగు చేస్తే తక్షణమే అవసరమైన యూరియా కొరతను కూటమి ప్రభుత్వం తీర్చాలని కోరారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ధనంజయశెట్టి, కృష్ణమూర్తి, చంద్ర, దొరస్వామి పాల్గొన్నారు.

## నిజం నిగ్గు తేలేనా..?

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబర్ 1147లోని కాలువలో టీడీపీ నాయకులు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వాటిపై అధికంగా ఫిర్యాదులు రావడంతో సోమవారం వీఆర్వో విశ్వనాథ్, సచివాలయం సర్వేయర్, సిబ్బంది సర్వే నిర్వహించారు. ఆక్రమణ చేసింది అధికార పార్టీ నాయకులు కావడంతో సర్వే సవ్యంగా కాగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకంలో గోకులం షెడ్డును అదే సర్వే నంబర్లో టీడీపీ నాయకుడు నిర్మించాడు. దానిపక్కన ఉన్న స్థలంలో మరొక నాయకుడు ఇసుక జల్లెడ వ్యాపారాన్ని మొదలుపెట్టాడు. ప్రస్తుతం అక్కడే కట్టడాలు కడుతున్నారు. ఇదంతా వీఆర్వోకు తెలిసినా అధికార పార్టీ నాయకులు కావడంతో ఎటువంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం అనేక ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సమగ్రంగా సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ఆదేశించడంతో సర్వే చేశారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



కాలువ పొరంబోకులో నిర్మించిన రేకుల షెడ్డు

### అమరలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో వున్న అమర హాస్పిటల్‌లో సోమవారం వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా హెల్తీ ఏజింగ్ అండ్ ది రోల్ ఆఫ్ ఫిజియోథెరపీ అనే అంశంపై కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో తిరుపతి, నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగుమాటి శ్రీహరి, ఎస్వీ మెడికల్ కాలేజ్ బయో కెమిస్ట్రీ విభాగం హెచ్‌వోడీ, ఏపీ స్టేట్ అలైడ్, హెల్త్ కేర్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు డాక్టర్ ఎస్.మాధవీలత, ప్రాంతీయ రవాణా అధికారి మురళీ మోహన్ మాట్లాడుతూ పలు వివరాలు వెల్లడించారు. హెచ్‌వోడీ డాక్టర్ కె.బిందుప్రియ, స్టేట్ ఫిజియోథెరపీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కిషోర్ కుమార్, డాక్టర్ రమ్యా సాయి, డాక్టర్ శ్రీలేఖ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయేంద్ర రెడ్డి, డాక్టర్ కటం కృష్ణయ్య పాల్గొన్నారు.

### రీసర్వేను వేగవంతం చేయండి



సర్వేయర్‌తో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని తెత్రిపాడు, చల్లమాంబపురం, తంగెళ్లపురం, నీర్పాకోట, తలారివెట్టు, వీఎస్‌పురం, కంచనపుత్తూరు, కనమనంబేడు, బీఎస్ పురం, గ్రామ రెవెన్యూలలో జరుగుతున్న భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దారు శ్రీదేవి ఆదేశించారు. ఆమె సోమవా రం భూముల రీ సర్వేపై సర్వేయర్లతో సమావేశం నిర్వమించారు. ఆమె మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే రైతులకు ఓ వరమని, రైతులందరూ భూముల రీసర్వేకు సహకరించాలన్నారు. భూముల రీసర్వే కోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కుమ్మార వెంకటపురం గ్రామ రెవెన్యూలో భూసర్వే పూర్త యిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు విజ్ఞానం



మాట్లాడుతున్న ఎంఈఓ జనార్దన్‌రాజు

నాగలాపురం: విద్యార్థుల్లో విజ్ఞాన కాంతులను నింపేవారే ఉపాధ్యాయులు అని ఎంఈఓలు బాబయ్య, రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో సోమవారం మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, జనార్దన రాజు ఆధ్వర్యంలో స్థానిక వ్యాపార సంఘం కల్యాణ మండపంలో ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. మండలంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు.

### విద్యార్థులకు పండ్ల పంపిణీ



విద్యార్థులకు ఆపిల్స్ అందజేస్తున్న గ్రీన్ ప్యానెల్ ఫౌండేషన్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి: మండలంలోని గ్రీన్ ఫ్యానల్ పరిశ్రమ ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రీన్ ప్యానెల్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలం రౌతుసూరమాల ప్రైమరీ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించి ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. అందులో భాగంగా వారంలో ఆరు రోజులు రోజుకు ఒక పండు చొప్పున పిల్లలకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు లోగనాథ జయరామ్, బాలసుధీర్, మణికంఠ, అన్నామృత ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

### కాలువను బాగు చేయాలని వినతి



తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొట్టంబేడు: మండలంలోని ఈదుల గుంట ఎల్‌ఐసీ కాలనీ మీదుగా వెళ్తున్న ఈదుల గుంట కాలువను బాగు చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జనరల్ సెక్రెటరీ షేక్ కరీముల్లా కోరారు. ఆయన సోమవారం తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఈదులగుంట చెరువు నిండి నీరు కాలువ ద్వారా ఎల్‌ఐసీ కాలనీ మీదుగా ప్రవహిస్తుందని తెలిపారు. కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ చిరంజీవి మాట్లాడుతూ కాలువ కొన్నిచోట్ల ఆక్రమణకు గురైందని, వాటిని తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, ఈదులగుంట పఠాన్ కరీముల్లా, పాలూరి వెంకట ముని, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని సత్కరిస్తున మైనార్టీ సెల్ నాయకులు

శ్రీకాళహస్తి: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో జరగనున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా మైనారిటీ సెల్ మీటింగ్ గురించి తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పి ఫరీద్ ఖాన్, షేక్ అస్లాం, షేక్ చాంద్‌బాషా, షేక్ ఇనాయతుల్లా, రాష్ట్ర జోనల్ మైనాటీ అధ్యక్షుడు సయ్యద్ షఫీ, అహమ్మద్ ఖాదరి పాల్గొన్నారు.

### కల్కి నిర్మాణాలను కూల్చేయాలి

వరదయ్యపాళెం: అంజూరు అటవీ సెక్షన్ పరిధిలో కల్కి ట్రస్టు వారు చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య సోమవారం మంగళగిరిలోని అటవీశాఖ మంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లాలోని అంజూరు అటవీ భూములను కల్కి ట్రస్టు వారు 21 ఎకరాలు ఆక్రమించి ఆశ్రమం పేరుతో పలు నిర్మాణాలు కట్టి వ్యాపారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిపై రెవెన్యూ అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు.

## పంటలకు సరిపడినంత యూరియా ఇవ్వాలి

శ్రీకాళహస్తి: పంటలకు సరిపడినంత యూరియాను రైతులకు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ కార్యదర్శి జనమాలు గురవయ్య, మండల కార్యదర్శులు మంచెల శివకుమార్, శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి గోపి, అయ్యప్ప, మురళి, జనార్దన్, ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షుడు చారుశీల, రైతులు మణి, రామ్మూర్తి కృష్ణయ్య, గురప్ప, సత్య, సాంబ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

## పెరటి తోటల్లో పౌష్టికాహారం

బుచ్చినాయుడుకండ్రిగ: ఇంటి వద్ద పెరటి తోటలలో కూరగాయాలను సేంద్రియ పద్ధతిలో పెంచడం ద్వారా పౌష్టికాహారం అందుతుందని ఐకేపీ ఏపీఎం మునెయ్య తెలిపారు. ఆయన సోమవారం పల్లమాల, కాటూరు, పార్లపల్లి గ్రామాల్లో మహిళ సమాఖ్య సభ్యులు ఇంటి వద్ద సాగు చేస్తున్న పెరటి తోటల కూరగాయాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీసీలు పయని, వెంకటరత్నం, వీరజిన్న, తదితరులు పాల్గొన్నారు.



పెరటితోటను పరిశీలిస్తున్న ఏపీఎం మునెయ్య